క్లుప్తంగా

హరితహారం చెట్లు దగ్ధం

కేశంపేట: మండలంలోని బీసీ హాస్టల్‌లో హరితహారంలో నాటిన మొక్కలు మంటలకు ఎండిపోయాయి. గతంలో హరితహారంలో నాటిన మొక్కలు చెట్లుగా మారాయి. గుర్తు తెలియని వ్యక్తులు మొక్కల దగ్గర గడ్డిని తొలగించేందుకు మంటలు పెట్టడంతో ఆ మంటలు గడ్డితో పాటు చెట్లకు అంటుకున్నాయి. దీంతో చెట్లు ఎండిపోయాయి.

కొత్తపేట విద్యాకమిటీకి జిల్లా ఉత్తమ అవార్డు



యాదయ్యకు అవార్డును ఇస్తున్న సుశీందర్

కేశంపేట: మండలంలోని కొత్తపేట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యాకమిటీకి జిల్లా ఉత్తమ కమిటీ అవార్డు రావడంపై పలువురు అభినందించారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పాఠశాల అభివృద్ధికి విశేష కృషి చేసినందుకు జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు చేతుల మీదుగా అవార్డును పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ కుమ్మరి యాదయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి మనోహర్, గ్రామ సర్పంచ్ నవీన్‌కుమార్, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు శ్రీనివాససాగర్ యాదయ్యను అభినందించారు.

ప్రిన్సిపాల్ భాను ప్రకాష్‌కు ఉత్తమ అవార్డు



అవార్డు అందుకుంటున్న భానుప్రకాష్

షాద్‌నగర్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన విద్యాదినోత్సవంలో ఉత్తమ ఉపాధ్యాయులు, అధ్యాపకులకు అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు, ప్రిన్సిపాల్ భానుప్రకాష్‌కు మంత్రి సబితారెడ్డి చేతుల మీదుగా ఉత్తమ అధ్యాపకుడి అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌ను పలువురు అభినందించారు.

బెల్ట్‌షాపుల నిషేధానికి తీర్మానం

కొందుర్గు: మండలంలోని చెక్కలోనిగూడెంలో బెల్ట్ షాపులను నిషేధించాలని మంగళవారం గ్రామస్తులందరు కలిసి తీర్మానం చేశారు. గ్రామంలో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు చేయడం వల్ల యువకులు మద్యానికి బానిసలుగా మారుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం అమ్మకాలు నిషేధం చేస్తే కొంతవరకు అరికట్టవచ్చని భావించిన గ్రామస్తులు బెల్ట్ షాపులను నిషేధించడానికి తీర్మానం చేశారు. ఎవరైనా మద్యం విక్రయిస్తే లక్ష రూపాయలు జరిమానా విధించడానికి ఒప్పందం చేసుకున్నారు.

తల్లీకొడుకు అదృశ్యం



శంకర్‌పల్లి: తల్లీకొడుకు అదృశ్యం అయిన సంఘటన శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ సంతోష్‌రెడ్డి తెలిపిన వివరాలు.. గాజులగూడ గ్రామానికి చెందిన అనురాధ(25) కొడుకు భార్గవ్(5)తో కలసి మంగళవారం ఉదయం ఇంటి నుంచి బయటికి వెళ్లింది. తిరిగి రాకపోవడంతో మామ వెంకన్న పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విద్యారంగానికి పెద్దపీట

దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం విద్యాదినోత్సవాన్ని చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గంలోని ఆయా పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు జెండాలు ఆవిష్కరించి, ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడారు. మారుతున్న అభివృద్ధి, సాంకేతికతకు అనుగుణంగా విద్యావ్యవస్థలో కూడా మార్పులు అవసరమన్నారు. విద్యార్థులు చదువుల్లో ముందంజలో ఉన్నారని అన్నారు.

–సాక్షి, నెట్‌వర్క్



కొందుర్గు : జాతీయ జెండాకు వందనం చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



మొయినాబాద్: ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు



శంకర్‌పల్లి: విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేస్తున్న ఎంపీడీఓ వెంకయ్యగౌడ్



షాబాద్: పుస్తకాలు, బట్టలు పంపిణీ చేస్తున్న అవినాశ్‌రెడ్డి, ఎంపీపీ ప్రశాంతిరెడ్డి తదితరులు



పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



మొయినాబాద్‌రూరల్: ఉపాధ్యాయులను సన్మానించిన శోభ, విద్యార్థులు



కేశంపేట: పాఠ్యపుస్తకాలను అందజేస్తున్న ఎంపీపీ, విశాల

సర్వీస్ రోడ్లను అభివృద్ధి చేయాలి

కొత్తూరు: కొత్తూరు నుంచి షాద్‌నగర్ సమీపంలోని సోలీపూర్ గేటు వరకు ఏర్పాటు చేసిన జాతీయ రహదారికి ఇరువైపులా సర్వీస్ రోడ్లను అభివృద్ధి చేయాలని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. సర్వీస్ రోడ్లు లేని కారణంగా స్థానికులు ప్రధాన రోడ్లగుండా రాకపోకలు కొనసాగిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారని వివరించారు. రోడ్లను అభివృద్ధి పరచాలని గతంలో పలుమార్లు ఎన్‌హెచ్‌ఏఐతో పాటు ఆయా శాఖల అధికారులకు విన్నవించినా ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి సర్వీస్ రోడ్లను అభివృద్ధి చేయాలని ఆయన కోరారు.

రేపు మండల పరిషత్ ప్రత్యేక సమావేశం

షాద్‌నగర్: ఫరూఖ్‌నగర్ మండల ప్రజా పరిషత్ ప్రత్యేక సమావేశం గురువారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వినయ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ ఖాజా ఇద్రీస్ అహ్మద్ అధ్యక్షతన నిర్వహించే ప్రత్యేక సమావేశంలో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 11గంటలకు నిర్వహించే సమావేశానికి సర్పంచులు, ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శివ

షాద్‌నగర్: నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్న వారిపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శివ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని రవీంద్రభారతి పాఠశాలలో పాఠ్యపుస్తకాలు విక్రయిస్తుండడంతో ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థి సంఘం నాయకులు అక్కడి చేరుకొని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ..ప్రైవేట్ పాఠశాలల్లో యజమాన్యాలు పాఠ్యపుస్తకాల దందా నిర్వహిస్తున్నారని ఆరోపించారు. పాఠ్యపుస్తకాలు అమ్మడం విద్యాహక్కు చట్టం నిబంధనలకు విరుద్ధమన్నారు. పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్న విషయం అధికారులకు తెలిసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. అధికారుల అండతోనే ప్రైవేట్ పాఠశాలల యజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని తెలిపారు. పుస్తకాల విక్రయాన్ని అడ్డుకోకపోతే ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి శంకర్, డివిజన్ అధ్యక్షుడు శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు సాయితేజ, గణేశ్, కిట్టు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ వైద్యుడిపై చర్యలు తీసుకోండి

షాద్‌నగర్: ఎలాంటి వైద్య పట్టా లేకుండా ప్రజల నాడీ పట్టి వైద్యం చేస్తున్నా నకిలీ వైద్యుడిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పట్టణానికి చెందిన వాసుదేవ్ అనే వ్యక్తి జిల్లా వైద్యాధికారికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. పట్టణంలోని పద్మావతీ కాలనీలో ఉన్న శ్రీలక్ష్మీ గణపతి మెడికల్ హాల్‌లో సుజీత్ సింగ్ అనే వ్యక్తి గత మూడేళ్ల నుంచి వైద్యుడిగా ప్రాక్టీస్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే అతను కేవలం పదవ తరగతి వరకు మాత్రమే చదివాడని, ఎలాంటి వైద్య పట్టా లేకున్నా వైద్యుడిగా చలామణి అవుతున్నట్లు పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతూ, ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న నకిలీ వైద్యుడిపై చర్యలు తీసుకోవాలని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు.

గో రక్షణ చట్టాన్ని అమలు చేయాలి

బజరంగ్‌దళ్ విభాగ్ కో–కన్వీనర్ రమేష్

షాబాద్: గో రక్షణ చట్టాన్ని అమలు చేయాలని బజరంగ్‌దళ్ విభాగ్ కో–కన్వీనర్ గూడెం రమేష్ పేర్కొన్నారు. మంగళవారం బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో సీఐ గురువయ్యగౌడ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోవులను కాపాడుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం 1977 జీఓను అమలులోకి తెచ్చిందన్నారు. రాజ్యాంగంలోని 48, 51 నిబంధనలు కూడా గోరక్షణకు ఏర్పాటు చేసినవే అని అన్నారు. ఈ చట్టాలను అమలు చేయవలసిన వివిధ ప్రభుత్వశాఖల నిర్లక్ష్యం కారణంగా వేలాది గోవులను కబేళాలకు తరలిస్తున్నారు. చెక్ పోస్టులు నిర్మించి తనిఖీలు చేయవల్సిందిగా పోలీస్‌శాఖ వారిని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా సహ సంయోజక్ లికిత్‌యాదవ్, సురేష్, లింగం, బజరంగ్‌దళ్ కార్యకర్తలు తదితరులున్నారు.



సీఐకు వినతి పత్రం అందజేస్తున్న రమేశ్

బడీడు పిల్లలను స్కూల్‌లో చేర్పించాలి

కొందుర్గు: బడీడు పిల్లలందరిని బడిలో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోత్స్న పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని టేకులపల్లి, ముట్పూర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు డ్రాపౌట్ కాకుండా చూసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యాభ్యాసం చేస్తూ అయిదేళ్లు పూర్తయిన విద్యార్థులందరిని సమీపంలోని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించే బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు పవిత్రాదేవి, నర్సింహరెడ్డి, ఎంపీటీసీ రామ్ రెడ్డి పాల్గొన్నారు.

పిల్లలను అంగన్‌వాడీలో చేర్చాలి

షాబాద్: బడీడు పిల్లలను అంగన్‌వాడీలో కేంద్రాల్లో చేర్పించాలని మక్తగూడ సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి అన్నారు. మండలంలోని మక్తగూడలో మంగళవారం అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థులచే బాడిబాట, సాముహిక అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిరాక్షరాస్యత నిర్మూలన, విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరు తమ వంతు పాలు పంచుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు కృష్ణ, ఉపసర్పంచ్ గ్రామస్తులు తదితరులున్నారు.



కొందుర్గు: అక్షరాభ్యాసంలో పాల్గొన్న విద్యార్థులు, అధికారులు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

యోగా గురువు వసంతలక్ష్మి



విద్యార్థులకు యోగా నేర్పిస్తున్న వసంతలక్ష్మి

మొయినాబాద్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధించవచ్చునని యోగా గురువు వసంతలక్ష్మి అన్నారు. మండలంలోని కేజీరెడ్డి ఇంజనీరింగ్ విద్యాసంస్థలో మంగళవారం ఎన్ఎస్ఎస్, సంస్కృతి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా గురువు వసంతలక్ష్మి విద్యార్థులకు యోగా అసనాలు నేర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు యోగా చేయడం వల్ల ఏకాగ్రత పెరుగుతుందని చెప్పారు. వసంత యోగా అకాడమీ ద్వారా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యోగా కోర్సుల ద్వారా శిక్షకులను తయారు చేస్తూ యోగా సర్టిఫికెట్లు అందిస్తున్నామన్నారు. ప్రపంచ యోగా దినోత్సవం 21వ తేదీన జరుపుకోవడం జరుగుతుందని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ విజయలత మాట్లాడుతూ.. ఎన్ఎస్ఎస్ యూనిట్‌లో భాగంగా విద్యార్థులకు యోగా నేర్పించడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులకు యోగా వల్ల కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వై. విజయలత, అరిస్టాటిల్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, డీఎస్ఏ హెడ్ ఉదయశ్రీ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎం. రత్నచారి, సీఈఈడీ హెచ్ సంధ్య, కళాశాల సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేహ దారుఢ్యానికి క్రీడలు దోహదం

రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మహిళా అధ్యక్షురాలు శోభ



క్రీడాసామగ్రి పంపిణీ చేసిన శోభ, ఎస్సై ప్రణీత్‌రెడ్డి

మొయినాబాద్‌రూరల్: క్రీడలు శారీర దారుఢ్యానికి దోహదపడతాయని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మహిళా అధ్యక్షురాలు దారెడ్డి శోభ అన్నారు. మంగళవారం కేతిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు క్రికెట్, వాలీబాల్, చెస్, క్యారమ్‌బోర్డు, టెబుల్ టెన్నిస్ తదితర క్రీడలకు సంబంధించిన సామగ్రిని శోభ సొంత డబ్బులతో పంపిణీ చేశారు. కార్యక్రమంలో మొయినాబాద్ ఎస్సై ప్రణీత్‌రెడ్డి పాల్గొని ఆమెతో కలిసి విద్యార్థులకు సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించినప్పుడే విద్యతో పాటు విజ్ఞానాన్ని పెంపొందించుకుంటారని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులే చదువుతుంటారని వారి విద్య అభివృద్ధికి తమవంతు సాయం అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్సింహులు, ఉపసర్పంచ్ సిద్ధయ్య, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు శంకర్‌పల్లి మండలానికి మంత్రి రాక

శంకర్‌పల్లి: నేడు శంకర్‌పల్లి మండలానికి విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి విచ్చేయనున్నారు. మండలంలోని మిర్జాగూడ–జనవాడ గ్రామం వరకు రూ.7కోట్లు హెచ్‌ఎండీఏ నిధులతో రోడ్డు పనులను ప్రారంభించడం జరుతుందన్నారు. అలాగే, మిర్జాగూడ వద్ద అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. కార్యక్రమంలో ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్యలు పాల్గొననున్నారని తెలిపారు.

రోజుల తరబడిగా పడిగాపులు



గ్రామీణ బ్యాంక్ వద్ద ఆధార్ సేవల కోసం ప్రజల పడిగాపులు

- ఆధార్‌కేంద్రంలో సేవలు అందక ప్రజల అవస్థలు
- 20రోజులుగా నిలిచిన ఆధార్ సేవలు
- రోజుకు 30 మందికే టోకన్లు
- సమస్యలు పట్టించుకోని అధికారులు

చేవెళ్ల: ఆధార్ కార్డు లేనిది ఏ పని జరగడం లేదు.. అయితే, ఆధార్‌కార్డు జారీ ప్రక్రియలో మాత్రం ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి కనిపిస్తోంది. ప్రతి ఒక్కరికి అవసరమైన ఆధార్ కార్డు సేవలు ఇప్పుడు నియోజకవర్గానికి ఒకే చోట కొనసాగుతుంది. గతంలో చేవెళ్ల డివిజన్ కేంద్రంలోని మీసేవ కేంద్రాల్లో అందుబాటులో ఆధార్ కేంద్రం కొనసాగేది. ప్రస్తుతం చేవెళ్లలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో ప్రత్యేకంగా ఒక ఆపరేటర్‌ను ఏర్పాటు చేసి ఈ సేవలను కొనసాగిస్తున్నారు. కానీ, ఇక్కడ ఈ సేవలు సక్రమంగా అందకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోజుల తరబడిగా బ్యాంకు చుట్టు తిరుగుతున్నారు.

రోజుకు 30 టోకన్లు మాత్రమే..

గ్రామీణ బ్యాంకుకు ఆధార్ సేవలు ఇచ్చిన నాటి నుంచి ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రతిరోజు 30 మందికి మాత్రమే టోకన్లు అంటూ బోర్డులు పెట్టి ఇవ్వడంతో వీటికోసం ప్రతిరోజు వివిధ గ్రామాల నుంచి ప్రజలు ఉదయం 6 గంటల నుంచి క్యూలైన్‌ల్లో నిలబడుతున్నారు. 30 టోకన్లు అయిపోతే మళ్లీ మరుసటి రోజు క్యూలైన్ ఇలా రోజు ప్రజలకు ఆధార్ సేవలకోసం పడిగాపులు తప్పడం లేదు.

ఆపరేటర్ రాకపోయినా అడిగేవారు లేరు.

నాలుగు మండలాల ప్రజలకు ఒకే కేంద్రంగా ఉన్న ఆధార్ సేవలు కేవలం ఒక ఆపరేటర్ చేతిలో ఉన్నాయి. అతడు తన ఇష్టానుసారంగా ఆధార్ సెంటర్‌ను నడుపుతున్నాడు. గత 20 రోజులుగా ఆధార్ సేవలను బందయ్యాయి. బ్యాంక్ అధికారులను ప్రజలు అడిగితే ఆపరేటర్ లేడు సొంత ఊరికెళ్లాడని చెబుతున్నారు. అందుకే సేవలు కొనసాగించడం లేదని సమాధానం చెప్పడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇచ్చేదే రోజు 30 మందికి అవికూడా ఇవ్వకుండా, ప్రత్యమ్నాయ ఆపరేటర్‌ను ఏర్పాటు చేయాలని నిలదీశారు. దీనిపై బ్యాంకు అధికారులు తమకు ఏమి సంబంధం లేదనే ధోరణిలో వ్యవహరిస్తున్నారని తెలిపారు.



రోజుకు 30 మందికే టోకన్లు అంటూ బోర్డు పెట్టిన దృశ్యం

మా దృష్టికి రాలేదు



ఈ విషయం తమ దృష్టికి రాలేదు. ఆధార్ కేంద్రాల వ్యవస్థ ఎలా ఉందో తెలుసుకుంటాను. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేసేందుకు ప్రయత్నిస్తాను. దీనిపై తనకు ఎవరైనా ఫిర్యాదు చేసి ఉంటే ఇప్పటికే పరిశీలించే వాళ్లం.

–వేణుమాధవ్‌రావు, చేవెళ్ల ఆర్డీఓ

ఆర్థిక సాయానికి దూరం

- మీసేవ కేంద్రాల వద్ద పడిగాపులు
- చివరి రోజు కూడా నిరాశే



కార్యాలయం వద్ద పడిగాపులు కాస్తున్న ప్రజలు

చేవెళ్ల: లక్షరూపాయల ఆర్థిక సాయం ఇస్తామని చెప్పి లక్ష తిప్పలు పెడుతున్నారని ప్రజలు ఆరోపించారు. మంగళవారం చేవెళ్ల తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉదయం నుంచి రాత్రి వరకు కుల, ఆదాయ పత్రాలు వస్తాయని ఎదురుచూశారు. సర్వార్ స్లోగా ఉందని సర్టిఫికెట్లు రావడం లేదని అధికారులు, సిబ్బంది చెప్పడంతో ఎంతో ఆశతో వచ్చిన ప్రజలు నిరాశతో వెనుదిరిగారు. ప్రభుత్వం కావాలనే సర్వార్ సమస్య సృష్టించిందని ప్రజలు దుమ్మెత్తిపోశారు. నిబంధన పెట్టి ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని వాపోయారు. చివరి రోజు కావడంతో ఎంతో ఆశతో వచ్చిన ప్రజలు సాయంత్రం 7 గంటల వరకు తహసీల్దార్ కార్యాలయం వద్దనే వేచి చూసి నిరాశతో వెనుదిరిగారు.